క్లుప్తంగా

వేడుకగా అష్టదళ పాదపద్మారాధన సేవ



రేణిగుంట(ఏర్పేడు): ఏర్పేడు మండలం వికృతమాల గ్రామంలో వెలసిన శ్రీ సంతాన సంపద వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. కార్తీక బహుళ ఏకాదశి సందర్భంగా స్వామివారికి 108 రజిత పుష్పాలతో అష్టాదళ పాదపద్మారాధన సేవను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త పసుపులేటి హరిప్రసాద్ నేతృత్వంలో ఈ పూజా కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో వేదపండితులు, భక్తులు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా



వాహనదారులను పరీక్షిస్తున్న పోలీసు సిబ్బంది

రేణిగుంట: రేణిగుంట అర్బన్ సీఐ శరత్‌చంద్ర, ఎస్‌ఐ అరుణ్‌కుమార్ రెడ్డి మంగళవారం సాయంత్రం రేణిగుంట పట్టణంలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన 12 మందికి జరిమానా విధించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతూ స్థానికులకు ఇబ్బందికర వాతావరణం సృష్టిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడులు చేశారు. 12 మంది మందుబాబులకు ఒక్కొక్కరికి రూ.1,100 చొప్పున మొత్తం రూ.13,200 జరిమానా విధించినట్లు తెలిపారు. రేణిగుంట పట్టణంలో మద్యం సేవించి ద్విచక్ర వాహనం నడిపిన ఎనిమిదిమందికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.80 వేలు జరిమానా విధించినట్లు తెలిపారు.

విద్యుత్ బకాయిలు వసూలు చేయండి



ఏర్పేడు విద్యుత్ ఉప కేంద్రాన్ని తనిఖీ చేసిన చీఫ్ జనరల్ మేనేజర్

రేణిగుంట: బకాయిలు త్వరితగతిన వసూలు చేయాలని విద్యుత్ శాఖ చీఫ్ జనరల్ మేనేజర్ ధర్మజ్ఞాని ఆదేశించారు. ఆయన మంగళవారం ఏర్పేడు విద్యుత్ సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. రూ.2 వేలకు పైగా బిల్లులు ఉన్న పెండింగ్ బకాయిలు వెంటనే వసూలు చేయాలన్నారు. వర్షాకాలం దృష్ట్యా బలహీనంగా ఉన్న చోట విద్యుత్ తీగలను మరమ్మతులు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ అకౌంట్ ఆఫీసర్ శ్రీనివాసులు, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ నాగేశ్వరరావు, ఏర్పేడు ఏఈ వాసుదేవయ్య పాల్గొన్నారు.


రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలం జ్ఞానమ్మకండ్రిగ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురికి స్వల్పగాయాలు అయ్యాయి. 2వ పట్టణ సీఐ వెంకటేశ్వర్లు కథనం మేరకు.. పల్నాడు జిల్లా రెంటచింతల మండలం మల్లవరం గ్రామానికి చెందిన శ్రీనునాయక్, కుటుంబ సభ్యులు 15 మందితో కలిసి తుపాన్ వాహనంలో తిరుమలకు బయలుదేరారు. తొట్టంబేడు మండలం జ్ఞానమ్మకండ్రిగ వద్ద బెంగళూరు నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న ట్రావెల్ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆరుగురికి స్వల్పగాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి, అనంతరం మెరుగైన వైద్యం కోసం రుయాకు తరలించారు.

లైంగిక హింస మానసిక ఆరోగ్యంపై ప్రభావం

సత్యవేడు: పిల్లలపై లైంగిక చర్యలతో వారి మానసిక ఆరోగ్యంపై వినాశకరమై ప్రభావం చూపుతుందని ఎంపీడీఓ చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం స్థానిక గ్రామీణాభివృద్ధి సంస్థ(వెలుగు) శాఖ ఆధ్వర్యంలో జెండర్ ఆధారిత హింసను వ్యతిరేకిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ లింగ ఆధారిత హింసల్లో లైంగిక హింస ఒకటి అన్నారు. అత్యాచారం, దోపిడీ, బలవంతపు వ్యభిచారంగా పేర్కొన్నారు. వెలుగు కోఆర్డినేటర్ శివకుమార్, ఈఓపీఆర్డీ తరుణాక్ష రెడ్డి, సీసీలు పళణి, మండల సమైక్య అధ్యక్షురాలు కోటీశ్వరి, డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ నిజాయితీ



పోలీసుల సమక్షంలో మహిళకు పర్సును అందజేస్తున్న ఆటో డ్రైవర్ రిషికుమార్

శ్రీకాళహస్తి: ఆటోలో మర్చిపోయిన పర్సు, సెల్‌ఫోన్‌ను మహిళకు తిరిగి అప్పజెప్పి ఓ ఆటో డ్రైవర్ నిజాయితీని చాటుకున్నాడు. శ్రీకాళహస్తి 1వ పట్టణ సీఐ గోపి కథనం మేరకు.. మల్లికమ్మ అనే మహిళ పట్టణంలోని మార్కెట్ వద్ద తొట్టంబేడు మండలానికి చెందిన రిషికుమార్ ఆటోలో ఎక్కింది. తరువాత ఆమెను లోబావి వద్ద దింపి వచ్చాడు. ఆటోలో మొబైల్‌ఫోన్, పర్సులో రూ.2 వేలు నగదును ఆమె మరిచిపోయినట్లు గుర్తించిన ఆటో డ్రైవర్, వాటిని శ్రీకాళహస్తి 1వ పట్టణ సీఐ గోపికి అందజేశారు. ఆయన మల్లికమ్మకు చెందినవిగా గుర్తించి ఆమెకు అందజేశారు. పోలీసులు రిషికుమార్‌ను అభినందించారు.

ఏరియా ఆస్పత్రికి సుస్తీ..

- రెండు నెలల కిందట శ్రీకాళహస్తి ఆస్పత్రిని సందర్శించిన కలెక్టర్
- వారం రోజుల్లో ఆస్పత్రిలో సమస్యలు పరిష్కరించాలని ఆదేశాలు
- నేటికీ పని చేయని జనరేటర్..
- మందుబాబులకు అడ్డాగా మారిన ఆస్పత్రి రోడ్డు
- ఇంటికి వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్న మహిళలు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



పనిచేయని జనరేటర్



శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో గత ఆరు నెలలుగా జనరేటర్ కనెక్షన్ ఇవ్వకపోవడంతో విద్యుత్ పోయిన సమయంలో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం కావడంతో విద్యుత్ ఎప్పుడు ఉంటుందో.. పోతుందో తెలియని పరిస్థితి. దీనిపై అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంతో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత ప్రభుత్వంలో రూ.12 కోట్లతో ఆస్పత్రి అభివృద్ధిలో భాగంగా 100 నుంచి 150 పడకలకు పెంచి అన్ని పరికరాలను సమకూర్చడం జరిగింది. ఎన్నికల తరువాత ఏర్పడిన నూతన ప్రభుత్వం ఆస్పత్రిలో కార్పొరేట్ స్థాయికి తీసుకెళ్తామని చెబుతున్నారే తప్ప.. కనీస సౌకర్యాల కల్పనకు చొరవ చూపడం లేదు. ఆపరేషన్ థియేటర్, బాలింతల వార్డుల్లో రాత్రిపూట కరెంటు పోతే పరిస్థితి ఏమిటని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కలెక్టర్ చెప్పి రెండు నెలలు గడుస్తున్నా..

గత సెప్టెంబరు 11న కలెక్టర్ వెంకటేశ్వర్ ఆస్పత్రిని సందర్శించి సూపరింటెండెంట్ విజయలక్ష్మి, ఆర్‌ఎం మధు, అధికారులతో చర్చించారు. ఆ సమయంలో జనరేటర్, ఆర్వో ప్లాంట్ పని చేయలేనది వారు కలెక్టర్‌కు విన్నవించారు. కలెక్టర్ స్పందిస్తూ ఏపీఎంఎస్ఐబీటీ అధికారులతో మాట్లాడి వారం రోజుల్లో జనరేటర్ సిద్ధం చేయాలని ఆదేశించారు. అయితే ఆస్పత్రి ఉద్యోగుల నిర్లక్ష్యమో ? విద్యుత్‌శాఖ నిర్లక్ష్యమో తెలియదు కానీ కలెక్టర్ మాట ఇచ్చి రెండు నెలలు గడుస్తున్నా జనరేటర్ పని చేయడం లేదు. దీంతో రోగులు నానా ఇబ్బందులు పడుతున్నారు. కరెంటు పోతే ఆస్పత్రిలో పరిస్థితి దారుణంగా ఉంటోంది.

ఎమ్మెల్యే సారూ ఏం చెప్పారంటే..

శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఆస్పత్రిని పరిశీలించినపుడు మల్లాడి డ్రగ్స్ ఆధ్వర్యంలో శుద్ధజల ప్లాంట్ ఏర్పాటు చేస్తామని తెలిపారు

అంధకారంలో ఆస్పత్రి రోడ్డు..

ఆస్పత్రి రోడ్డులో వీధిదీపాలు వెలగకపోవడంతో అంధకారంగా మారుతోంది. అన్న క్యాంటీన్ వరకే లైట్లు వెలుగుతున్నాయి. దీంతో రాత్రుల్లో ఆస్పత్రి నుంచి బయటకు రావాలంటే రోగులు, ఉద్యోగులు, సిబ్బంది భయభ్రాంతులకు గురవుతున్నారు. దానికితోడు మందుబాబులు ఆస్పత్రి దాటిన తరువాత రోడ్డుపక్కనే కూర్చుని మద్యం సేవిస్తుండడంతో మరింత ఇబ్బంది పడుతున్నారు. పురపాలకసంఘ అధికారులు స్పందించి వెంటనే లైట్లు వేయాలని రోగులు కోరుతున్నారు. అలాగే మందుబాబులు అక్కడ చేరకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు.

కలెక్టర్ ఏమన్నారంటే..!

శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి సమస్యలపై కలెక్టర్ వెంకటేశ్వర్‌ను వివరణ కోరగా.. వెంటనే డీఎంహెచ్‌ఓకు తెలిపి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.



అంధకారంలో ఆస్పత్రి రహదారి

కానీ నేటికీ నెరవేర్చక పోవడం వాటర్‌క్యాన్లను తెప్పించి రోగులకు నీటిని అందజేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి ఏరియా ఆస్పత్రిలో సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.



వెలగని వీధిదీపాలు

ముక్కంటి సేవలో పలువురు ప్రముఖులు



ఆశీర్వాదం తీసుకుంటున్న అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: తమిళనాడు రాష్ట్రం తిరుమంగళం చిదంబరేశ్వరాలయానికి చెందిన ఆదినారాయణ గణేష్‌స్వామి మంగళవారం శ్రీకాళహస్తీశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద ఆయనకు ఆలయ అధికారులు, పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు ఆయనకు తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం పట్టణంలోని లోబావి సమీపంలో ఉన్న సుబ్రహ్మణ్యస్వామి ఆలయానికి చేరుకున్నారు. కార్యక్రమంలో అంబలిస్వామి, వేణు, మునికుమార్, ప్రసాద్, ఈశ్వరసాయి పాల్గొన్నారు.

ప్రతి బుధవారం విద్యుత్ గ్రీవెన్స్

వరదయ్యపాళెం: మండలంలో నెలకొన్న విద్యుత్ సమస్యలపై ప్రతి బుధవారం మండల విద్యుత్‌శాఖ కార్యాలయంలో ఫిర్యాదు చేసుకోవచ్చని ఏఈ విజయ్ వెంకటేష్ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రతి బుధవారం విద్యుత్ గ్రీవెన్స్ నిర్వహిస్తామని, ఆ రోజు ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల కోసం ప్రత్యేకంగా రిజిస్టర్ ఏర్పాటు చేసి విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నోటీసులు ఇవ్వకుండా తొలగించడం అన్యాయం

– వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నూకతోటి రాజేష్



పచ్చాలమ్మ కాలనీలో కూలదోసిన షాపులను పరిశీలిస్తున్న నూకతోటి రాజేష్

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పల్లమాల గ్రామపంచాయతీ పరిధిలోని పచ్చాలమ్మ కాలనీ వద్ద కేటీరోడ్డుకు ఓ వైపున ఉన్న షాపులను అధికారులు నోటీసులు ఇవ్వకుండానే తొలగించడం దారుణమని వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ తెలిపారు. ఆయన మంగళవారం బాధితులతో కలసి అధికారులు కూలదోసిన షాపులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయనకు బాధితులు తమ గోడు విన్నవించారు. వైఎస్సార్‌సీపీకి చెందిన వారమనే నెపంతో ఆర్‌అండ్‌బీ డీఈ రాంబాబు, తహసీల్దార్ సుబ్రమణ్యం, ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు, ఎస్‌ఐ విశ్వనాథనాయుడు, ఎంఈఓ రవీంద్రనాథ్ సిబ్బందితో వచ్చి జేసీబీతో దౌర్జన్యంగా షాపులను కూలదోశారని తెలిపారు. షాపులను తొలగిస్తామని ముందుగా చెప్పుంటే వస్తువులను భద్రపరుచుకునే వాళ్లమన్నారు. ఉన్నపళంగా కూలదోయడంతో వస్తువులు పనికిరాకుండా పోయాయని, దీంతో తాము వీధిన పడ్డామని కంటతడి పెట్టుకున్నారు. తహసీల్దార్ సుబ్రమణ్యం కార్యాలయానికి పిలిచి మీకు మరోచోట ఇంటి స్థలం ఇచ్చి షాపులను తొలగిస్తామని చెప్పి, అకస్మాత్తుగా వచ్చి దౌర్జన్యంగా తొలగించడం దారుణమన్నారు. గత 20 ఏళ్లుగా వివిధ షాపులను పెట్టుకుని జీవనం సాగిస్తున్న తమకు జీవనోపాధి లేకుండా చేశారని తెలిపారు. స్థలాలకు తాము ఏటా పంచాయతీకి పన్ను చెల్లిస్తున్నామన్నారు. అధికారులను ఎంత వేడుకున్నా కనికరించలేదని, భయభ్రాంతులకు గురిచేసి షాపులను ధ్వంసం చేశారని వాపోయారు.

పేదలకు అన్యాయం చేస్తారా..!

అనంతరం నూకతోటి రాజేష్ మాట్లాడుతూ అధికార పార్టీ టీడీపీ నాయకులకు అధికారులు తొత్తులుగా మారి వారికి అనుకూలంగా వ్యవహరించడం మంచి పద్ధతి కాదని తెలిపారు. పేదల షాపులను కూలదోసి, ధ్వంసం చేసి నడ్డిరోడ్డుపై నిలబెట్టడం బాధాకరమన్నారు. అధికారం శాశ్వతం కాదని, పది మందికి మంచి చేయాలని, ప్రజలు గమనిస్తున్నారని, సమయం వచ్చినప్పుడు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ విషయాన్ని పార్టీ హైకమాండ్ దృష్టికి, జిల్లా కలెక్టరుకు వివరించి న్యాయం జరిగేలా చూస్తానన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ జేసీఎస్ కన్వీనరు వేలూరు రాకేష్, నాయకులు గోపాల్‌రెడ్డి, మణినాయుడు, గురునాథం, గురవయ్య, అజయ్‌కుమార్‌రెడ్డి, సంజీవయ్య, ప్రసాద్‌పాల్ పాల్గొన్నారు.

బాలన్న మృతి వైఎస్సార్‌సీపీకి తీరని లోటు



బాలయ్య మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న నూకతోటి రాజేష్

వరదయ్యపాళెం: సత్యవేడు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీకి పెద్దదిక్కుగా ఉన్న బందిల బాలన్న మృతి పార్టీకి తీరని లోటు అని నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ తెలిపారు. మంగళవారం ఆయన కంచరపాళెంకు వెళ్లి బాలయ్య మృతదేహానికి పార్టీ శ్రేణులతో కలసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలన్న కుటుంబానికి అండగా ఉంటామన్నారు. అనంతరం కుమారులు బందిల సురేష్, బందిల కుమార్‌ను పరామర్శించి ఓదార్చారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పకడ్బందీగా నదీ హారతికి ఏర్పాట్లు



సమావేశంలో మాట్లాడుతున్న ఈఓ బాపిరెడ్డి

శ్రీకాళహస్తి: ముక్కంటి ఆలయం ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీన నిర్వహించనున్న స్వర్ణముఖి నదీ హారతికి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఈఓ బాపిరెడ్డి ఆదేశించారు. మంగళవారం ఆలయ పరిపాలన భవనంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈఓ మాట్లాడుతూ అన్నివిభాగాల సిబ్బంది సమష్టిగా పనిచేసి నదీ హారతిని విజయవంతం చేయాలని కోరారు. నదీ తీరంలో బారికేడ్లు, భక్తులు కూర్చునేందుకు వసతులు కల్పించాలని సూచించారు. ఈ మేరకు కార్యక్రమ నిర్వహణపై వేదపండితులతో చర్చించినట్లు వెల్లడించారు. అనంతరం నదీ తీరంలో ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ కృష్ణారెడ్డి, ఏఈఓ లోకేష్ రెడ్డి, ఈఈ మురళీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాలకు స్పందన



కారిపాకంలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

వరదయ్యపాళెం: మండలంలోని కారిపాకం గ్రామ సచివాలయ పరిధిలో కారిపాకం, పులివల్లం గ్రామాలకు చెందిన ప్రజలకు స్విమ్స్‌కు చెందిన శ్రీ బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. పింక్ బస్ ద్వారా వైద్యసిబ్బంది మహిళలు, పోలీసులకు నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు స్వచ్ఛందంగా క్యాంప్‌లో పాల్గొని స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకున్నారు. వరదయ్యపాళెం పీహెచ్‌సీ వైద్యాధికారి ఉదయ్‌కుమార్, స్విమ్స్‌కు చెందిన బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ వైద్యాధికారులు డాక్టర్ హరిత, డాక్టర్ పద్మావతి, స్థానిక సర్పంచ్ ఆనంద్, పంచాయతీ కార్యదర్శి శేఖర్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు. అలాగే 28న సీఎల్ఎన్‌పల్లి, ఇందిరానగర్, 29న మరదవాడ, సంతవేలూరు, డిసెంబర్ 2న వరదయ్యపాళెం-2, కదూరు గ్రామ సచివాలయాల పరిధిలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేపట్టనున్నట్లు వైద్యాధికారులు తెలిపారు.

సత్యవేడు: మండలంలోని మదనంబేడు, దాసుకుప్పంలోఉచిత క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. పాప్ స్మియర్ వైద్య పరీక్షలు చేయించుకోవడం వల్ల గర్భాశయ క్యాన్సర్ గుర్తించవచ్చని డాక్టర్ హరిత అన్నారు. లక్షణాలను ప్రాథమిక స్థాయిలో గుర్తిస్తే పూర్తిగా నివారించే అవకాశాలు ఉందన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం



మహిళ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ

రేణిగుంట: రేణిగుంట-అన్నాసామిపల్లి మార్గం వాగు చెక్ డ్యాం నీటిలో మంగళవారం ఓ మహిళ మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. రేణిగుంట అర్బన్ ఎస్‌ఐ అరుణ్‌కుమార్‌రెడ్డి సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి వాగునీటి ముళ్ల పొదల్లో ఉన్న మహిళ మృతదేహాన్ని వెలికితీశారు. మూడు రోజుల కిందట మృతి చెంది ఉండడంతో దుర్వాసన వస్తోంది. మృతురాలి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాకపోవడంతో అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. వివరాల కోసం పోలీసులు చుట్టుపక్కల గ్రామాల్లో విచారణ చేపట్టారు.

ఆకట్టుకున్న మాక్ పార్లమెంట్





మాక్ పార్లమెంట్‌లో మాట్లాడుతున్న స్పీకర్, మాక్ పార్లమెంట్‌లో పాల్గొన్న సభ్యులు, మంత్రులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కల్లివెట్టు జెడ్పీ ఉన్నత పాఠశాల్లో మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధానోపాధ్యాయులు రూపేష్‌కుమార్ అధ్యక్షతన విద్యార్థులు మాక్ పార్లమెంట్ నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన మాక్ పార్లమెంట్ సమావేశాలు ఆకట్టుకున్నాయి. తాజా సమస్యలపై పార్లమెంట్‌లో అధికార పార్టీ నేతలు, ప్రతి పక్షనేతలు మంత్రులు పేర్లతో విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు, సమస్యలకు మంత్రులు సమాధానాలు, స్పీకర్ సభ నడిపిన తీరు అందరినీ ఆకట్టుకుంది.

విద్యార్థుల ర్యాలీ

నాగలాపురం: మండలకేంద్రంలోని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్లస్‌లో మంగళవారం రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఎంఈఓ జనార్దనరాజు ఆధ్వర్యంలో ఘనంగా ర్యాలీ నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ భారత రాజ్యాంగ సృష్టికర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అడుగుజాడల్లో అందరూ నడవాలని పిలుపునిచ్చారు. హెచ్ఎం పూడి కస్తూరయ్య, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం..

నాగలాపురం: మేజర్ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ చిన్నదొరైసుధా ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు.

నేర నియంత్రణపై ప్రత్యేక దృష్టి



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ రవికుమార్

నారాయణవనం: పుత్తూరు సబ్ డివిజన్ పరిధిలో నేర నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించి, మహిళలను, విద్యార్థులను చైతన్య పరుస్తున్నామని పుత్తూరు డీఎస్పీ రవికుమార్ తెలిపారు. మంగళవారం సాయంత్రం నారాయణవనం పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ పుత్తూరు సబ్ డివిజన్‌లో సైబర్ నేరాలు, మహిళలపై దాడులు, డ్రగ్స్, గంజాయి విక్రయాలపై ప్రత్యేక దృష్టి పెట్టామని తెలిపారు. నేరాలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే ఇంజినీరింగ్, డిగ్రీ కళాశాలల్లో మేధావులతో సైబర్ నేరాలు, డ్రగ్స్, గంజాయితో కలిగే దుష్ఫలితాలపై అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. దొంగతనాలను అరికట్టడానికి ఆలయాలు, వ్యాపార సముదాయాల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు చేస్తున్నామని, డ్రగ్స్, గంజాయి అమ్మకాలపై గట్టి నిఘా పెట్టామని తెలిపారు. మండలంలో నేర, రోడ్డు ప్రమాదాల నియంత్రణపై సిబ్బంది సూచనలు ఇచ్చారు. డీఎస్పీ రవికుమార్‌తో పాటు పుత్తూరు రూరల్ (నారాయణవనం) సీఐ రవీంద్ర, ఎస్‌ఐ రాజశేఖర్ ఉన్నారు.

పంటల బీమాపై శ్రద్ధ చూపండి



మాట్లాడుతున్న ఏఓ శోభారాణి

నారాయణవనం: రబీలో సాగు చేస్తున్న పంటలకు ప్రకృతి వైపరీత్యాలతో కలిగే నష్ట పరిహారం కోసం బీమా చేసుకోవాలని ఏఓ శోభారాణి సూచించారు. మంగళవారం మండలంలోని పాలమంగళం ఉత్తరపుకండ్రిగలో సర్పంచ్ సాయిరవి అధ్యక్షతన రైతులతో సమావేశం నిర్వహించారు. సాగు చేసిన వరి, వేరుశనగ క్షేత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో శోభారాణి మాట్లాడుతూ మంగళవారం నుంచి మూడు రోజుల పాటు వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచించిందని తెలిపారు. వర్షాలు దాటిన తర్వాత పాడి దుక్కిలో వేరుశనగ విత్తనాలను శుద్ధి చేసి వేయాలన్నారు. మండలంలో సాగవుతున్న వరికి ఆకు ముడత, కాండం తొలుచు పురుగు ఆశించిందన్నారు. ఒక ఎకరం పొలానికి 400 గ్రాముల కార్టాప్ హైడ్రోక్లోరైడ్ (కెల్డాన్) లేదా 60 మిల్లీ క్లోరాంట్రనిలిప్రోల్ (కొరాజెన్)ను 200 లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలని రైతులకు సూచించారు. ఈ రబీ సీజన్‌లో మండలంలో వేరుశనగ, వరి సాగు చేస్తున్న రైతులు పంట బీమా కోసం మీసేవా కేంద్రాల్లో ఎకరం వరికి రూ.630, వేరుశనగ పంటకు రూ.450 చొప్పున డిసెంబర్ 15లోపు చెల్లించాలని సూచించారు. కార్యక్రమాల్లో వ్యవసాయ సహాయకులు దివ్య, వెటర్నరీ సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రాజ్యాంగం.. అందరికీ సమానం





బుచ్చినాయుడుకండ్రిగ: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న రాజేష్, నాయకులు, శ్రీకాళహస్తి: మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీనివాసనాయక్

- అట్టహాసంగా రాజ్యాంగ దినోత్సవం
- డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు

బుచ్చినాయుడుకండ్రిగ: సమాజంలో ప్రతిఒక్కరూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాల సాధనకు కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ పిలుపునిచ్చారు. ఆయన మంగళవారం మండలంలోని పచ్చాలమ్మ కాలనీ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతికి బాటలు వేస్తూ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించేలా రాజ్యాంగాన్ని మనకు అందించిన అంబేడ్కర్ చిరస్మరణీయులన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నారాయణవనంలో..

నారాయణవనం: మండల కేంద్రంలో నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సొరకాయలు, ఎంపీపీ దివాకర్‌రెడ్డి, నాయకులు, ఎంపీటీసీ సభ్యులు సర్పంచ్‌లు, పార్టీ నాయకులు నివాళులు అర్పించారు.

వరదయ్యపాళెంలో..

వరదయ్యపాళెం: రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రాజశేఖర్, అలాగే ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ ప్రసాద్, ఈఓపీఆర్డీ చిరంజీవి రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

సత్యవేడులో..

సత్యవేడు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంల్లో ఎంపీడీఓ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

చట్టం అందరికీ సమానమే

శ్రీకాళహస్తి: చట్టం అందరికీ సమానంగా వర్తించాలని శ్రీకాళహస్తి న్యాయస్థాన 12వ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్ నాయక్ అన్నారు. పట్టణంలోని న్యాయస్థాన భవనంలో మంగళవారం జాతీయ చట్టం, వరకట్న వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ నవంబరు 26న ఇండియా రాజ్యాంగ దినోత్సవంతో పాటు జాతీయ చట్ట దినోత్సవం కూడా జరుపుకుంటారని చెప్పారు. వరకట్నాన్ని నిషేధించి చాలా ఏళ్లు అయిందని, చట్టాలు కఠినంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తి బేబీ రాణి, న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థుల ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

రేణిగుంటలో..

రేణిగుంట: మండలంకేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి సర్పంచ్ నగేశం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అలాగే ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు జూలియస్ రాజు ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం జరుపుకున్నారు. ఏర్పేడు మండలం పాపానాయుడుపేట హైస్కూల్‌లో అంబేడ్కర్ బహుజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు స్టార్ కృష్ణ విద్యార్థులకు రాజ్యాంగ ప్రతులను పంపిణీ చేశారు.